# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 14-07-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- భారత్-బ్రిటన్ దేశాల మధ్య కుదిరిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ) రేపటి నుండి అమల్లోకి రానుంది.
- కార్గిల్ విజయ్ దివాస్ వేడుకల్లో భాగంగా "శౌర్య విజయ్ యాత్ర"ను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు ప్రారంభించారు.
- ఏఐతో ఉద్యోగాలు కోల్పోతామనే భయాన్ని అధిగమించి, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయ కార్మికులకు పిలుపునిచ్చారు.
- బర్మింగ్ హామ్ లో జరుగుతున్న తొలి వన్డే క్రికెట్ మ్యాచ్ లో ఇంగ్లాండ్.. భారత్ కు 259 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

==========================

భారత్-బ్రిటన్ దేశాల మధ్య సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ) దేశ వాణిజ్య ప్రయాణంలో ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ పేర్కొన్నారు. ఈ ఒప్పందం ప్రపంచంలోని రెండు ప్రధాన ఆర్థిక వ్యవస్థల మధ్య భవిష్యత్ దృష్టితో కూడిన ఆర్థిక భాగస్వామ్యానికి పునాది వేస్తుందని చెప్పారు. న్యూఢిల్లీలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈ ఒప్పందం రేపటి నుంచి అమల్లోకి రానుందని, దీంతో భారత్-బ్రిటన్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాల్లో ఒక నూతన అధ్యాయం ప్రారంభమవుతుందన్నారు. ఇది విస్తృత రంగాలను పరిగణనలోకి తీసుకుని టారిఫ్‌లు, టారిఫ్ సంబంధిత అడ్డంకులను తగ్గించేందుకు దోహదపడుతుందని తెలిపారు. పాల ఉత్పత్తులు, వ్యవసాయ రంగాల ప్రయోజనాలను పరిరక్షిస్తూనే.. భారతీయ వస్తు సేవలకు ఈ ఒప్పందం బ్రిటన్ మార్కెట్లో మరింత ప్రాప్యత కల్పిస్తుందని అగర్వాల్ వివరించారు.

==========================

‘శౌర్య విజయ్ యాత్ర’ను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ న్యూఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారక చిహ్నం నుండి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ యాత్ర ప్రజల్లో, ముఖ్యంగా యువతలో దేశభక్తి భావనను మరింత పెంపొందిస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. దేశ స్వాతంత్ర్యం, సమగ్రత గౌరవం కేవలం సరిహద్దులకు మాత్రమే పరిమితం కాకుండా, ప్రజల స్మృతి పథంలో ఎల్లప్పుడూ కొనసాగుతుందనే సందేశాన్ని ఈ యాత్ర భావితరాలకు అందిస్తుందని పేర్కొన్నారు. 13 రోజుల పాటు సాగే ఈ మోటార్ సైకిల్ యాత్రలో 28 మంది రైడర్లు సుమారు 1,900 కిలోమీటర్ల దూరాన్ని ప్రయాణించి.. భారతీయ సైనికుల ధైర్యసాహసాలు, త్యాగాలను తెలియజేస్తారని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

కార్గిల్ విజయ్ దివస్–2026 దేశవ్యాప్త వేడుకలలో భాగంగా నిర్వహిస్తున్న ఈ యాత్ర, ఈ నెల 26న లడఖ్‌లోని ద్రాస్ ప్రాంతంలోని కార్గిల్ యుద్ధ స్మారక స్థూపం వద్ద ముగియనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కృత్రిమ మేధస్సు (ఏఐ) యువత నైపుణ్యాలను సమర్థవంతంగా పెంపొందించగలదని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరం సదస్సులో ఆయన ఈరోజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సాంకేతికతను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఉద్యోగాలు కోల్పోతామనే భయాన్ని అధిగమించి.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్ సాంకేతికత దేశవ్యాప్తంగా విప్లవాత్మక మార్పులకు దారితీస్తున్నాయన్నారు. పరిశ్రమలు, కార్మిక సంఘాల మధ్య బలమైన సహకారం అవసరమని, అలాగే బ్రిక్స్ దేశాల మధ్య పరస్పర సహకారం ద్వారా ఉమ్మడి అభివృద్ధిని సాధించవచ్చని తెలిపారు. సాంకేతిక పురోగతికి అనుగుణంగా యువతను తీర్చిదిద్దేందుకు స్కిల్ ఇండియా మిషన్ ద్వారా కొత్త కోర్సులను ప్రవేశపెడతామని మన్‌సుఖ్ మాండవీయ హామీ ఇచ్చారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇండియా పోస్ట్ చరిత్రలో తొలిసారిగా మొదటి త్రైమాసిక ఆదాయం 4 వేల కోట్ల రూపాయల టర్నోవర్ నమోదు చేసింది. గత ఏడాది తొలి త్రైమాసికంలో 3 వేల 280 కోట్లుగా ఉన్న ఆదాయం.. ఈ ఏడాది 22 శాతం వృద్ధితో 4 వేల కోట్లకు పైగా చేరడం గర్వకారణమని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా పేర్కొన్నారు. వార్షికంగా 30 శాతం వృద్ధి లక్ష్యానికి ఇది శుభారంభమని తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వ్యూహాత్మక కార్యాచరణ ప్రణాళికను రూపొందించడంతో పాటు, తొలి త్రైమాసిక పనితీరును సమీక్షించేందుకు ఆయన అధ్యక్షతన న్యూఢిల్లీలో ఈరోజు ఒక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ వివరాలను సింధియా వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

ఈ సమావేశంలో పాల్గొన్న కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మొత్తం త్రైమాసిక లక్ష్యంలో 100 శాతానికి పైగా సాధించిన ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే, పార్సెల్ సేవల్లో 100 శాతానికి పైగా లక్ష్యాన్ని అధిగమించిన బీహార్, తమిళనాడు సర్కిళ్లను అభినందించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో చోటు చేసుకుంటున్న పరిణామాలను భారత్ నిశితంగా గమనిస్తోందని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. హర్మూజ్ జలసంధి ద్వారా సురక్షితమైన నిర్బంధం లేని సముద్ర రవాణా కొనసాగాల్సిన అవసరాన్ని భారత్  పునరుద్ఘాటిస్తోందని ఆయన చెప్పారు. హర్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న ఒక చమురు నౌకపై ఇరాన్ దాడి చేయడంతో ఒక భారతీయుడు ప్రాణాలు కోల్పోగా.. మరో ఆరుగురు భారతీయులు గాయాలపాలయ్యారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై రణధీర్ జైస్వాల్ న్యూఢిల్లీలో ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ.. జరిగిన సంఘటనను ఖండించిందని చెప్పారు. ఈ మేరకు ఇరాన్ ప్రభుత్వానికి భారత్ తన తీవ్ర నిరసనను తెలియజేసిందని, ఇటువంటి దాడులు వెంటనే నిలిపివేయాలని స్పష్టం చేసినట్లు రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతీయ రైల్వేలను ఆధునీకరించేందుకు చేపడుతున్న సంస్కరణల్లో భాగంగా భూసేకరణ ప్రక్రియ మొత్తాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు 'రైల్ భూమి' పోర్టల్‌ను ప్రారంభించనున్నట్లు ఆ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. రైల్వే మంత్రిత్వ శాఖ నిర్మాణ రంగం సహా పలు విభాగాల్లో అనేక సంస్కరణలను అమలు చేస్తున్నట్లు న్యూఢిల్లీలో ఆయన ఈరోజు పాత్రికేయులకు తెలియజేశారు. ఎరువులను ఇకపై కంటైనర్ల ద్వారా రవాణా చేయడానికి అనుమతిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి అయ్యే ఫ్లై యాష్‌ను కూడా ఇకపై కంటైనర్లలోనే రవాణా చేయనున్నట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. కంటైనర్ విధానంలో భాగంగా ఏకీకృత లైసెన్సింగ్ వ్యవస్థను కూడా ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించారు. రైల్వే వాగన్ల రూపకల్పనను ఇకపై పరిశ్రమలే చేపట్టవచ్చని అశ్వినీ వైష్ణవ్ వివరిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ ఆహార ధాన్యాల నిల్వ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి న్యూఢిల్లీలో ఈరోజు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రతిపాదిత నిల్వ విధానంతో పాటు ప్రైవేట్ ఎంట్రప్రెన్యూర్స్ గ్యారంటీ (పీఈజీ) పథకంపై కూడా ఈ సమీక్షలో చర్చించామని ప్రహ్లాద్ జోషి సామాజిక మాధ్యమం పోస్టులో తెలిపారు. ఆహార ధాన్యాల నిర్వహణలో ఉత్పన్నమవుతున్న సవాళ్లపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇంగ్లాండ్‌లోని బర్మింగ్ హామ్ లో జరుగుతున్న తొలి వన్డే క్రికెట్ మ్యాచ్ లో భారత్ కు.. ఇంగ్లాండ్ 259 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 258 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇంగ్లాండ్ బ్యాట్స్‌మెన్లలో జోరూట్ 76, లియామ్ డాసన్ 68 పరుగులతో రాణించగా.. భారత్ బౌలర్ అక్షర్ పటేల్ అత్యధికంగా 4 వికెట్లు తీశాడు. లక్ష్య ఛేధనలో భారత్ 10 ఓవర్లు పూర్తయ్యే సరికి 2 వికెట్లు నష్టపోయి 56 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = =